క్లుప్తంగా

డిజిటల్ బుక్ ఆవిష్కరణ



దొర్నిపాడులో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: కూటమి ప్రభుత్వంలో వేధింపులు, అన్యాయానికి గురవుతున్న వారికి అండగా నిలబడేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రూపొందించిన డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను సోమవారం ఆపార్టీ మండల ప్రెసిడెంట్ బత్తుల నాగేశ్వరావు ఆవిష్కరించారు.దొర్నిపాడులో జరిగిన ఈ కార్యక్రమంలో బత్తుల నాగేశ్వరావు మాట్లాడుతూ రెడ్‌బుక్ పేరుతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన వారు భవిష్యత్‌తో తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కాకనూరు మనోహర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నర్సిరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, బత్తుల రాజు, దూదేకుల దస్తగిరి, విజయ్, రామనాథ్‌రెడ్డి, నాగయ్య, బత్తుల క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వెండి హారతి కలశం వితరణ



వెండి కలశం అందజేస్తున్న దాతలు

రుద్రవరం: రుద్రవరం–అప్పనపల్లె దారిలో వెలసిన లక్ష్మీ గోదా సమేత వాసాపురం వెంకటేశ్వర స్వామికి నంద్యాలకు చెందిన గెల్వి చంద్రబాను కుటుంబ సభ్యులు సోమవారం అరకిలో బరువు గల వెండి హారతి కలశాన్ని విరాళంగా అందజేశారు. ఈ నేపథ్యంలో ఆలయ కోశాధికారి కానాల నర సింహుడు, అర్చకులు వారిని అభినందించి ప్రత్యేక పూజలు చేయించారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించాలి

నంద్యాల: జీఎస్టీ తగ్గింపుపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో మండల స్థాయి అధికారులతో జేసీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది రిజిస్ట్రేషన్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జీఎస్టీ రేట్లపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు సందర్శించిన ఇళ్ల వివరాలు, ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ ద్వారా వినియోగదారులకు లభించే ప్రయోజనాలను వివరించే కరపత్రాలను ఆవిష్కరించారు.

ఎయిడ్స్ వ్యాధి గ్రస్తుల పట్ల వివక్ష చూపొద్దు

శిరివెళ్ల: ఎయిడ్స్ వ్యాధి గ్రస్తుల పట్ల వివక్షత చూపవద్దని చైతన్య ఎడ్యుకేషనల్ సొసైటీ మేనేజర్ వర్ధనాచారి అన్నారు. సోమవారం ఎయిడ్స్ వ్యాధి అవగాహన ప్రచార రథంను సీహెచ్‌ఓ ప్రారంభించారు. వ్యాధి పట్ల ప్రజలో నెలకొన్న అపోహలు, వ్యాధి వ్యాప్తి, నివారణపై ప్రచారం చేయడం జరుగుతుందన్నారు. రథంతో పాటు కరపత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని మేనేజర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

నిధుల మంజూరు

శిరివెళ్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగు దొడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ త్రిలింకేశ్వరరెడ్డి సోమవారం తెలిపారు. ఒక్కో సెంటర్‌కు రూ. 36వేల చొప్పున గుండంపాడు, శిరివెళ్ల 12వ సెంటర్, మహదేవపురం 3వ, రాజనగరం, గోవిందపల్లె 1వ సెంటర్‌కు నిధులు మంజూరయ్యాయని, త్వరలో వాటితో పనులు మొదలు కానున్నట్లు వెల్లడించారు.

పెన్షనర్ల సంఘం అభివృద్ధికి కృషి

నంద్యాల(అర్బన్): జిల్లా ప్రభుత్వ పెన్షనర్ల సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి ఫరూక్ తెలిపారు. ఇటీవల పెన్షనర్ల సంఘానికి జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు సోమవారం మంత్రి ఫరూక్‌ను స్థానిక పార్టీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారిని అభినందిస్తూ సంఘంలో ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని, అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో సంఘం నూతన అధ్యక్షుడు రామసుబ్బయ్య, సహ అధ్యక్షుడు గఫార్, కోశాధికారి కాశీంవలి, ఉపాధ్యక్షులు డేవిడ్ ప్రధాన కార్యదర్శి లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సుల సంఖ్య పెంచాలి

నంద్యాల(న్యూటౌన్): కూటమి సర్కారు బస్సుల సంఖ్య పెంచకపోవడంతో ఉచిత బస్సు పథకం అమలులో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఏఐవైఎఫ్ నాయకులు అన్నారు. బస్సులు తక్కువగా ఉండటంతో వివిధ వర్గాల ప్రజలు ప్రయాణానికి ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనిపై దృష్టి సారించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి , ఆర్‌ఎం రజియాసుల్తానాకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు నాయక్, రమణ, శంకర్, సాయి, ధనుంజయ్, తదితరులు పాల్గొన్నారు.









చాగలమర్రిలో బిందెసేవలో ఆర్యవైశ్య యువకులు, ఆళ్లగడ్డలోని అమ్మవారి శాలలో సరస్వతీ దేవిగా అమ్మవారు, దొర్నిపాడు అమ్మవారిని పూజిస్తున్న భక్తులు, వీరారెడ్డిపల్లెలో కోలాటం

సరస్వతీ నమస్తుభ్యం







నంద్యాలలో సరస్వతీదేవిగా కాళకాంబాదేవి, రుద్రవరం, శిరివెళ్లలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



నంద్యాల జగజ్జననీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఊరూరా కనుల పండువగా సాగుతున్నాయి. ఎనిమిదో రోజు సోమవారం పలు ఆలయాల్లో అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అక్షరాభ్యాసాలు, కన్య పూజలు, మూలా నక్షత్ర పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పంచామృతాభిషేకాలు, హోమాలు, రథోత్సవం, పల్లకీ సేవ, లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. నంద్యాల పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన దుర్గా మాత విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆధ్యాత్మిక నృత్యాలు, భక్తి సంగీత కచేరిలు, సంకీర్తనలు, కోలాటం, చెక్క భజన, హరికథలు, నవ రాత్రులపై ప్రవచనాలు జరిగాయి. ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పట్టణంలోని శ్రీకాళికాంబాదేవాలయంలో, బాలాజీ కాంప్లెక్స్ కల్యాణ మండపంలో, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో, మల్లికార్జునస్వామి దేవాలయంలో, సంజీవనగర్ రామాలయంలో అమ్మవార్లు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బొమ్మలసత్రం శ్రీషిర్డీసాయిబాబా ఆలయంలో దుర్గాదేవికి పూజలు చేశారు. నిమిషాంబాదేవి ఆలయంలో అమ్మవారికి శ్రీవామనాశ్రమ స్వామిజీ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జగజ్జననీ దేవాలయంలో భక్తులు కుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గోస్పాడు: పసురపాడు గ్రామంలో నెలకొల్పిన దుర్గమ్మను వేద పండితుడు సుధాకర్ శర్మ ఆధ్వర్యంలో సరస్వతీ దేవిగా అలంకరించి పూజలు చేశారు.

ఉయ్యాలవాడ: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ఇంజేడులో చౌడేశ్వరీదేవిని సరస్వతీ దేవిగా అలంకరించి పూజలు చేశారు.

రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరం, ఎల్లావత్తుల గ్రామాల్లో దసరా ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయి. రుద్రవరంలో సో మవారం అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించారు.

చాగలమర్రి: ముత్యాలపాడు గ్రామంలో వెలసిన శ్రీమత్కన్యకాపరమేశ్వరీదేవి ఏనిమిదో రోజు శ్రీసరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని పల్లకీపై ఊరేగించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే బిందెసేవ కార్యక్రమం నిర్వహించారు.

ఆళ్లగడ్డ: శ్రీ మత్కకన్యకాపరమేశ్వరి అమ్మవారు సకల విద్యా ప్రదాత సరస్వతీ దేవి అలంకరణలో భక్తులను కనువిందు చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏనిమిదో రోజైన సోమవారం మూల మూర్తి వాసవీ అమ్మవారికి విశేష పూజల అనంతరం చదువుల తల్లి సరస్వతీగా అలంకరించారు. అంతకు ముందు హోమం, కుంకుమ పూజలు నిర్వహించారు.

దొర్నిపాడు: స్థానిక అమ్మవారిశాలలో కన్యకాపరమేశ్వరి సోమవారం సరస్వతీదేవీగా భక్తులకు దర్శనం ఇచ్చారు. చదువులతల్లికి వందనం అంటూ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

శిరివెళ్ల: మండలంలో ఏ గ్రామం చూసినా దేవీ శరన్నవరాత్రుల శోభ కనిపిస్తోంది. ఆలయాల వద్ద వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సోమవారం స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో సరస్వతీ దేవీ అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

అధికారుల తీరుపై కౌన్సిలర్ల ఆగ్రహం



అధికారుల తీరుపై సభలో నిలబడి నిరసన తెలుపుతున్న కౌన్సిలర్లు

బొమ్మలసత్రం: నంద్యాల మున్సిపల్ అధికారుల వ్యవహారశైలిపై కౌన్సిలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారపార్టీ నాయకుల మాదిరిగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. తమ వార్డుల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు సైతం ఆహ్వానించడం లేదన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ మాబున్నిసా అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఇందులో మున్సిపల్ అధికారుల తీరుపై కౌన్సిలర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ వార్డుల్లో ఎటువంటి కార్యక్రమం జరిగినా అధికారికంగా వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లకు పిలుపు ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మార్కెట్‌గేట్ల వేలం పాటను పరిశీలించేందుకు వెళ్లిన తనను కమిషనర్ శేషన్న బయటకు వెళ్లిపోమ్మనటం ఎంత వరకు కరెక్టు అని నిలదీశారు. అధికారులు తీరు మార్చుకోవాలన్నారు. అనంతరం చైర్‌పర్సన్ మాబున్నిసా మాట్లాడుతూ వార్డుల్లో నాణ్యత లేకుండా రహదారులు, డ్రైనేజీలు నిర్మిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. జనవరి నెలలో తోపుడు బండ్ల నుంచి గేట్లు వసూలు చేయవద్దని కౌన్సిల్ తీర్మాణం చేసిందన్నారు. అయినా మున్సిపల్ అధికారులు గేట్ల వేలం పాటలు నిర్వహించటం సరి కాదన్నారు. తమ నిర్ణయానికి వ్యతిరేకంగా మున్సిపల్ అధికారులు వ్యవహరించడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు బాయ్‌కాట్ చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో చైర్‌పర్సన్ సభను వాయిదా వేశారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యమివ్వాలి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశం



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

నంద్యాల: డ్రగ్స్ రహిత జిల్లాగా నంద్యాలను తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మత్తు పదార్థాల నివారణలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో 'డ్రగ్స్ వద్దు బ్రో' అనే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. నంద్యాల ఏఎస్పీ మంద జావళి అల్ఫోన్స్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణకు గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మత్తు పదార్థాల లభ్యత ఏమైనా ఉందా? మహిళల పట్ల పోలీసులు ఏ విధంగా స్పందిస్తున్నారు. తదితర అంశాలపై ప్రభుత్వం పబ్లిక్ పర్సెప్షన్ ఆధారంగా ఫీడ్ బ్యాక్ తీసుకొని జిల్లాకు ర్యాంకింగ్ ఇవ్వడం జరుగుతోందన్నారు. విద్యా సంస్థల్లో ఈగల్ టీమ్స్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో గంజా పంట సాగు లేకుండా చూడాలన్నారు.అలాగే మహిళల రక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నంద్యాల ఏఎస్పీ మాట్లాడుతూ పాఠశాలల వంద మీటర్ల పరిధిలో నో స్మోకింగ్ జోన్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి విద్యా సంస్థలో ఈగల్, శక్తి టీమ్స్ ఏర్పాటు చేసి వాటి ద్వారా యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వస్తున్నట్లు చెప్పారు. మత్తు పదార్థాల నివారణ కోసం 1972 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ మత్తు పదార్థాల వినియోగిస్తే, సరఫరా చేస్తే అందుకు అమలు చేసే శిక్షలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం మత్తు పదార్థాల నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన ఈగల్ టీమ్స్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

స్త్రీ పథకంలో కార్మికులు నమోదు కావాలి

నంద్యాల: జిల్లాలోని చిన్న పరిశ్రమల నుంచి పెద్ద పరిశ్రమల వరకు వాటిలో పనిచేస్తున్న కార్మికులంతా స్త్రీ పథకంలో నమోదు కావాలని కలెక్టర్ రాజకుమారి చెప్పారు. కలెక్టరేట్‌లో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వేతనం రూ.21వేల లోపు ఉన్న ఉద్యోగులందరూ ఈ పథకంలో నమోదు కావచ్చన్నారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులతో పాటు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కూడా ఈ పథకంలో భాగం కావచ్చని తెలిపారు. దీని వల్ల ఉద్యోగి అనారోగ్యంతో సెలవు పెడితే వేతనం చెల్లింపుతో పాటు అవసరమైన అన్ని వైద్య ఖర్చులను ప్రభుత్వం భరించనుందని తెలిపారు.

కూటమి ప్రభుత్వంపై బలిజలు కన్నెర్ర

- దొమ్మర కులాన్ని బలిజ కులంలో కలుపుతూ జారీ చేసిన జీవో 5ను రద్దు చేయాలని డిమాండ్



ఆళ్లగడ్డలో నిరసన తెలుపుతున్న బలిజ సంఘం నేతలు



రుద్రవరంలో తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న బలిజ నాయకులు

ఆళ్లగడ్డ: తరతరాలుగా శ్రీ కృష్ణదేవరాయల వంశంగా పిలువబడుతున్న బలిజ కులస్తుల్లోకి దొమ్మెరులను 'గిరి బలిజలు'గా చేరుస్తూ కూటమి ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ 5 పై నిరసన హోరెత్తుతోంది. ఈ జీవోను వెంటనే రద్దు చేయకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని బలిజ సంఘం నేతలు హెచ్చరిస్తున్నారు. దొమ్మెర్లను 'గిరి బలిజ'లుగా గుర్తిస్తూ విడుదల చేసిన జీఓకు వ్యతిరేకంగా సోమవారం నియోజకవర్గంలోని బలిజలు మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున ర్యాలీలు చేపట్టి రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఆళ్లగడ్డలో స్థానిక శ్రీ కృష్ణదేవరాయలు విగ్రహం వద్ద పెద్ద ఎత్తున గుమికూడిన బలిజలు సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయం చేరుకొని తహశీల్దార్ రత్నకుమారికి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దొమ్మెర కులం వారికి జోడించిన 'గిరి బలిజ' పదాన్ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్రంలోని బలిజ, కాపు కుటుంబాలను అందరిని అవమాన పరిచినట్లేనని మండిపడ్డారు. దీనిపై సర్కారు స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.

బలిజ పదం తొలగించాలి

రుద్రవరం: గిరిబలిజ నుంచి బలిజ అనే పదాన్ని తొలగించడంతో పాటు జీఓ నంబర్ 5ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రమైన రుద్రవరంలో బలిజ సంఘం నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం తహసీల్దారు అల్ఫ్రెడ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకుడు పోలా గురుమూర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడేందుకు బలిజలు ముఖ్య పాత్ర పోషించారని అలాంటి వారి మనోభావాలు దెబ్బతీనేలా జీఓ నంబర్ 5ను విడుదల చేయడం సమంజసం కాదన్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో నాయకులు కొల్లం పుల్లయ్య, కేసీ నరసింహులు, సంజీవ రాయుడు, ఏర్వ క్రిష్ణమూర్తి, బండల శీను, వెంకటసుబ్బయ్య, సురేష్, ఓబులయ్య, క్రిష్ణమూర్తి, మో హన్, పుల్లయ్య, బ్రహ్మయ్య, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి



సఫాయి మిత్ర సురక్ష శివిర్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఫరూక్, కలెక్టర్

నంద్యాల: పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. సోమవారం నంద్యాల పురపాలక సంఘం పరిధిలోని పారిశుద్ధ్య కార్మికుల కోసం సఫాయి మిత్ర సురక్ష శివిర్ కార్యక్రమంలో భాగంగా శాంతిరాం జనరల్ ఆస్పత్రి, వైద్య కళాశాల సహకారంతో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని మంత్రి ఫరూక్.. జిల్లా కలెక్టర్ రాజకుమారితో కలిసి ప్రారంభించి మాట్లాఆరు. పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వీధుల్లో పరిశుభ్రత పనులు చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆస్పత్రులను తమవిగా భావించి పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ అంకిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శేషన్న, సిబ్బంది, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

కోటేష్‌కు ప్రశంసా పత్రం




ప్రశంసా పత్రం అందుకుంటున్న కోటేష్

నంద్యాల(అర్బన్): చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ వికసిత్ భారత్ 2047కు సంబంధించిన అంశంపై వేసిన ఉత్తమ పెయింటింగ్‌కు ప్రశంసా పత్రం, జ్ఞాపిక లభించింది. కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి విజయవాడలో పెయింటింగ్ కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 50మంది చిత్రకారులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో భారతమాత ఆశీస్సులతో కంప్యూటర్ టెక్నాలజీ, ప్రపంచమంతా భారత్‌పై ఉన్నట్లు వేసిన కన్నులో ప్రపంచం చిత్రాలకు ఫైన్ ఆర్ట్ యోగివేమన యూనివర్సిటీ డైరెక్టర్ మృత్యుంజయరావు, రమేష్ అభినందించి ప్రశంసా పత్రం అందించినట్లు కోటేష్ తెలిపారు. నంద్యాల చిత్రకారులు రాముడు, వాసు, ఓబులేసు, సుంకన్న తదితరులు సోమవారం సంతోషం వ్యక్తం చేశారు.

వైభవంగా లక్ష్మీ గణపతి సరస్వతీ హోమం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీ గురు రాఘవేంద్ర బ్యాంక్ కోచింగ్ సెంటర్‌లో సోమవారం వైభవంగా లక్ష్మి గణపతి సరస్వతీ హోమం నిర్వహించారు. జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కోచింగ్ సెంటర్ అధినేత డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి, డైరెక్టర్లు పెద్దిరెడ్డి మౌలాలి రెడ్డి, పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి పాల్గొన్నారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నగర డోన సుధీర్ తెలిపారు. సరస్వతీదేవి కరుణాకటాక్షాలు ఉండాలని విద్యార్థులు మొక్కుకున్నారు.

పనిగంటలు తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చౌడప్ప

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పని గంటలను 8 గంటల నుంచి 13 గంటలకు పెంచడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి చౌడప్ప, శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పనిగంటల పెంపును రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించడం బాధాకరమన్నారు. కార్మికుల హక్కులు, భద్రతకు భంగం కలిగిస్తే సహించేది లేదన్నారు. స్వదేశీ, విదేశీ బడా కార్పొరేటర్ల సొంత ప్రయోజనాలు నెరవేర్చడానికి కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. దీనిపై కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రఫీ, పఠాన్, యాకూబ్ పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ పేరుతో ఆర్చి కట్టించాలని వినతి

నంద్యాల(అర్బన్) పట్టణంలోని సలీమ్ నగర్ మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న మౌలానా అబుల్‌కలాం ఆజాద్ సర్కిల్‌లో ఆర్చి నిర్మించాలని నంద్యాల ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ గౌరవ అధ్యక్షుడు సమీఉల్లా కోరారు. ఈ మేరకు సోమవారం మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బాబాఫక్రుద్దీన్, కౌన్సిలర్ బాషిత్, మసీద్‌ఖాన్, హర్షద్ ఉసేన్, హిదాయతుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కాటికాపరులు ఆందోళన



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో కాటి కాపరులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ నాయకులు డేవిడ్, జిల్లా అధ్యక్షురాలు రంగమ్మ మాట్లాడుతూ జిల్లాలో 2వేల మందికి పైగా కాటికాపరులు ఉన్నారన్నారు. వీరికి ఐడీకార్డులు జారీ చేసి నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు.అలాగే వారి పిల్లలకు కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్యను అందించాలన్నారు.

ఉద్యోగుల సంక్షేమాన్ని మరచిన ప్రభుత్వం



నూతన కమిటీని ఎన్నుకున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం మరచిందని నంద్యాల జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు మౌలాలి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో నంద్యాల పట్టణ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి మున్సిపల్ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మన్నను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మౌలాలి, జిల్లా ఆర్థిక కార్యదర్శి శివప్రసాద్ మాట్లాడుతూ విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలు తీర్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను సత్వరమే చెల్లించాలని, పీఆర్సీ ప్రకటన చేయాలని లేని పక్షంలో ఉద్యమబాట తప్పదన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఈవీ గోపాలకృష్ణ, కన్వీనర్ చంద్రశేఖర్, నరసింహరావు, బాలసుబ్బయ్య, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటరమణ, హబీబుల్లా, చెన్నకేశవులు, నాగేశ్వరరెడ్డి, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు మందుల పంపిణీ




మందులను పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): ప్రపంచ గుండె దినోత్సవాన్ని పురస్కరించుకుని నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో దివ్యంగులకు నెలవారి మందులను అందజేశారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, అధ్యక్షుడు ఎంపీవీ రమణయ్య మాట్లాడుతూ దీర్ఘకాలిక జబ్బులతో బాధపడే 20 మంది దివ్యాంగులకు నెలవారి మందుల పంపిణీ నిరంతరం కొనసాగిస్తామన్నారు. ప్రతి సంవత్సరం ఒక నెల మందులు ఉచితంగా అందిస్తున్న లయన్ రవి ప్రకాష్‌కు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నాగరాజు, జనార్ధన్, మధు, వెంకటేశ్వర్లు, సూర్య పాల్గొన్నారు.

శానిటేషన్ కార్మికులను తొలగించొద్దు

గోస్పాడు: నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులను తొలగించరాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలవెంకట్ డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాలలో శానిటేషన్ కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 సంవత్సరాలు నిండిన వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తామని, కాంట్రాక్టర్లు బెదిరించడం అన్యాయమన్నారు.కార్యక్రమంలో శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు చిన్నమ్మ, రాజమ్మ, వెంకటేశ్వరమ్మ, సులోచన, సునిత, హరిప్రియ, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

గుండె ఆరోగ్యంపై దృష్టి సారించాలి



ర్యాలీలో పోలీసు ఉన్నతాధికారులు, వైద్యులు

గోస్పాడు: ప్రతి ఒక్కరు గుండె ఆరోగ్యంపై దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ ఎస్పీ సునీల్ షెరాన్ అన్నారు. సోమవారం వరల్డ్ హార్ట్ డే సందర్భంగా నంద్యాల పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. దీనిని జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరు మితాహారం తీసుకుంటూ రోజూ వ్యాయామం చేయాలన్నారు. అలాగే పొగతాగడం, మద్యం సేవించడం వంటి దురలావాట్లకు దూరంగా ఉండాలన్నారు. గుండె వైద్య నిపుణులు జహీంగీర్, మురళీకృష్ణ, కోటి శ్రీనివాసులు మాట్లాడుతూ ఇటీవల కాలంలో గుండె జబ్బులు పెరిగిపోయాయన్నారు. స్థూలకాయం రాకుండా చూసుకోవాలన్నారు. ఛాతిలో నొప్పి, ఒళ్లంతా చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనిపించినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ జావళి ఆల్ఫోన్స్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, డాక్టర్లు రవికృష్ణ, మధుసూదనరావు, సహదేవుడు, విజయబాబు, తదితరులు పాల్గొన్నారు.